మార్కెట్ భవనాలకు మోక్షమెప్పుడో?

- కోర్టు కేసుతో నిర్మాణ పనులు నిలిపివేత
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యాపారులు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన రెండు కూరగాయలు, సమీకృత మాంసం మార్కెట్ భవనాలు వివిధ కారణాలతో నిలిచాయి. సుమారు ఆరేళ్ల క్రితం ఈ రెండు మార్కెట్ల భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గాంధీ సెంటర్‌లోని కూరగాయల మార్కెట్‌లో మార్కెట్ భవనం కోసం కూరగాయల దుకాణాలను తొలగించి రూ.2కోట్ల నిధులతో 2019లో భవన నిర్మాణ పనులు చేపట్టారు. పునాదులతోపాటు పిల్లర్ల నిర్మాణం పూర్తయిన తరువాత పలు కారణాలతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. అనంతరం కొంతమంది భవన నిర్మాణంపై కోర్టును ఆశ్రయించడంతో పనులు పూర్తిగా నిలిచాయి. ప్రస్తుతం పిల్లర్లలోని ఇనుము శిథిలావస్థకు చేరుకుంది. భవన నిర్మాణం కోసం దుకాణాలను తొలగించడంతో గత ఆరేళ్లుగా వ్యాపారులు రోడ్డు పక్కన తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడేళ్లుగా పనులు నిలిచినా ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్ చొరవ చూపి నిధులు మంజూరు చేయించి మార్కెట్ భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


గాంధీ సెంటర్‌లో నిలిచిన మార్కెట్ భవన పనులు


వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిలిచిన పనులు

శాశ్వత దుకాణాలు లేక ఇబ్బందులు

ఆరేళ్ల క్రితం మార్కెట్‌లో శాశ్వత భవన నిర్మాణం కోసం దుకాణాలను కూల్చారు. నూతన భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచాయి. మార్కెట్‌లో తాత్కాలికంగా దుకాణాలను ఏర్పాటు చేసుకుని ఇబ్బందులు పడుతూ కూరగాయలు అమ్ముకుంటున్నాం. వెంటనే మార్కెట్ నిర్మాణాలను పూర్తి చేయాలి


- చల్లా శ్రీనివాస్, వ్యాపారి

జమిలి ఎన్నికలతో సుపరిపాలనకు అవకాశం

పెద్దవంగర: జమిలి ఎన్నికలతో దేశంలో సుపరిపాలనకు అవకాశం దక్కుతుందని జనగామ, మహబూబాబాద్ జిల్లాల బీజేపీ ఉపాధ్యక్షులు దేవర ఎల్లన్న, రంగు రాములుగౌడ్ అన్నారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ అనే అంశంపై బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని సాయిగార్డెన్‌లో సదస్సు నిర్వహించారు. మండల అధ్యక్షుడు బమ్మెరబోయిన సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జమిలి ఎన్నికలతో ప్రజాధనం, ప్రభుత్వ కార్య నిర్వహణ సమయం ఆదా అవుతుందని తెలిపారు. దేశం పటిష్టంగా ఉండాలంటే ఒకే దేశం–ఒకే ఎన్నిక అవసరమన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిని ఝాన్సీ, కోట కుమార్, రచ్చ కుమార్, రవిబాబు, జలగం ఆనంద్, సురేష్, సందీప్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దేవర ఎల్లన్న

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

తొర్రూరు: వేసవిలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తొర్రూరు ఏరియా ఆస్పత్రి సూపరిటెండెంట్ సుగుణాకర్‌రాజు తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సుగుణాకర్‌రాజు మాట్లాడుతూ.. ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతోందన్నారు. వడదెబ్బ కారణంగా ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు. వడదెబ్బను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరం, ప్రాణాంతకమని తెలిపారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు బయటికి వెళ్లొద్దని సూచించారు. రక్తహీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి జ్వలిత, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, వైద్యులు ప్రియాంక, నందన, మానస, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగడి వేలం

తొర్రూరు: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో సోమవారం అంగడి వేలం నిర్వహించారు. కమిషనర్ శాంతికుమార్ అధ్యక్షతన నిర్వహించిన వేలంలో పశువులు, గొర్రెలు, మేకల వేలంకు రూ.37.22 లక్షలు, చికెన్ వ్యర్థాల సేకరణకు రూ.1.10 లక్ష, కమేళాకు రూ.68వేలతో టెండర్‌దారులు దక్కించుకున్నారు. తైబజార్, గంపచీటి వేలానికి ఎవరూ ముందుకు రాకపోవంతో వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ కట్టా స్వామి, సిబ్బంది, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

క్లబ్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో ఆఫీసర్ క్లబ్ పేరుతో చలామణి అవుతున్న ప్రభుత్వ క్లబ్‌ను వెంటనే స్వాధీనం చేసుకోవాలని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. పట్టణ నడిబొడ్డున సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఆఫీసర్ క్లబ్ ఉందని, దాని విలువ రూ.50కోట్లపైనే ఉందన్నారు. క్లబ్ భూమికి సంబంధించిన అన్నిపత్రాలు ఉన్నాయని, భూమి ప్రభుత్వానిది కాదని, తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ప్రత్యేక చొరవ తీసుకొని స్వాధీనం చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మి, శ్రావణ్, ఫాతిమా, శంకర్, ప్రవీణ్, రమేశ్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను నిరసిస్తూ ధర్నా

గార్ల: చలో హైదరాబాద్‌కు సిద్ధమైన ఆశవర్కర్లను గార్లలో పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం గార్ల నెహ్రూసెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు, రమాదేవి, నమ్మి, చంద్రమ్మ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దీపికలకు రూ.20వేల వేతనం చెల్లించాలి

గార్ల: గ్రామ దీపికలకు నెలకు రూ.20వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐకేపీ ఏపీఎం నరేంద్రకుమార్‌కు ఆయన గ్రామ దీపికలతో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో వీఓఏలు సీహెచ్ మౌనిక, కృష్ణవేణి, వసంత, వినోద, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

ఆక్రమణల తొలగింపునకు చర్యలు


మెయిన్ రోడ్డును పరిశీలిస్తున్న పోలీసులు

డోర్నకల్: డోర్నకల్ మెయిన్ రోడ్డులోని డ్రైయినేజీలపై ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. మెయిన్ రోడ్డు, బ్యాంక్ స్ట్రీట్‌లో రోడ్డుకు ఇరుపక్కలా దుకాణాలు, తోపుడు బండ్లను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో సోమవారం సీఐ బి.రాజేష్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, ఎస్సైలు వంశీధర్, గడ్డం ఉమ మెయిన్ రోడ్డును పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మెయిన్ రోడ్డులో డ్రైయినేజీలను ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాలా సుమేర్ చంద్‌జైన్, మాదా శ్రీనివాస్, తాళ్లూరి హనుమంతరావు పాల్గొన్నారు.

40బస్తాల నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు: పోలీసుల కళ్లు కప్పి బీదర్ నుంచి కురవి మండలం తరలిస్తున్న నల్లబెల్లం వాహనాన్ని పోలీసులు పట్టుకుని సీజ్ చేసిన సంఘటన మండల కేంద్రంలోని రామకృష్ణ క్రాస్ రోడ్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. బీదర్ నుంచి మహబూబాబాద్ వైపునకు నల్లబెల్లంతో వాహనం వెళ్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు తనిఖీ చేయగా బొలేరో వాహనంలో రూ.2.20లక్షల విలువ చేసే 40బస్తాల నల్లబెల్లం, 4బస్తాల పటిక బెల్లం ఉన్నట్లు గుర్తించామన్నారు. వాహనం డ్రైవర్‌ను విచారించగా నెల్లికుదురు మండలం హేమ్లా తండా శివారు ఇస్రా తండాకు చెందిన బానోతు శంకర్ బీదర్ నుంచి తక్కువ ధరకు తెచ్చి ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేందుకు అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. కురవి మండలం బద్యనాయక్ తండాకు చెందిన మూడు జగన్‌కు సరఫరా చేసేందుకు తీసుకెళ్తున్నామన్నారు. పట్టుకున్న నల్లబెల్లం వాహనాన్ని స్వాధీనం చేసుకుని శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


పట్టుకున్న నల్లబెల్లం వాహనం చూపిస్తున్న పోలీసులు

విజయవంతం చేయాలి

మహబూబాబాద్: వచ్చే నెల 21న హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ఫంక్షన్‌లో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్య యాత్ర సోమవారం మానుకోటకు చేరుకుంది. కాగా స్థానిక అమరవీరుల స్థూపం వద్ద నాయకులు నివాళులర్పించారు. ఈసందర్భంగా చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఫోరం మానుకోట పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ధరంసోత్ నారాయణ సింగ్, శంతన్‌రామరాజు, కమ్మగాని కృష్ణమూర్తి, హన్మంతు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

గూడూరు/మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. గూడూరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ హైస్కూల్ (ఈఎంఆర్ఎస్)తో పాటు మహబూబాబాద్ మండలం ముత్యాలమ్మగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతి గృహాన్ని సోమవారం రాత్రి కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని కిచెన్, క్లాస్‌రూం, డైనింగ్ హాల్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం స్టడీ అవర్స్‌లో ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. సబ్జెక్ట్ వారీగా ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పిల్లలకు ఎలాంటి సందేహాలు ఉన్నా తీర్చాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టాలన్నారు.


స్టడీ అవర్స్‌లో విద్యార్థులతో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మార్కెట్ బయట కొనుగోళ్లు నిలిపివేయాలి

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ బయట ఇష్టానుసారంగా చేపడుతున్న వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్లను నిలిపివేయాలంటూ సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రం మార్కెట్ కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ హమాలీ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి ఎక్స్‌లెన్సీ అవార్డు పొందిన కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో కార్మికులకు పని లేకుండా పోతుందన్నారు. లైసెన్స్‌లు కలిగిన వ్యాపారులు మార్కెట్‌లో సరుకులను కొనుగోలు చేయకుండా, తమ దుకాణాల వద్ద, మిల్లుల వద్ద కొనుగోలు చేస్తున్నప్పటికీ పాలకమండలి, అధికారులు పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. పాలకమండలి చర్యలు తీసుకుని, మార్కెట్‌లోనే ఖరీదు అయ్యేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా వేబ్రిడ్జి తూకాల్లో మోసాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో దడువాయి యూనియన్ నాయకులు మంగీలాల్, సింగిరెడ్డి కృష్ణ, నాగేంద్రబాబు, బేతిరాజు, శ్రీను, హమాలీ నాయకులు బండి రాజు, జిలాని, ప్రవీణ్, సంజీవ, సూరయ్య పాల్గొన్నారు.


మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

క్షయ నిర్మూలనపై అవగాహన ర్యాలీ


మరిపెడ: ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మరిపెడ: ప్రపంచ క్షయవ్యాధి(టీబీ) దినోత్సవం సందర్భంగా మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి రవి మాట్లాడుతూ. ఈవ్యాధి దగ్గు, తుమ్ము, ఉమ్మివేయడం ద్వారా వ్యాపిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వామి, ఆరోగ్య సిబ్బంది సుదర్శన్, ఆచార్యులు, లక్ష్మీకుమారి, సిరి పాల్గొన్నారు.

దంతాలపల్లి: టీబీ లేని సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ప్రజావైద్యశాల వైద్యులు, చైతన్య, కవిత అన్నారు. సోమవారం క్షయ దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

పెద్దవంగర: మత సామరస్యానికి ప్రతీకగా ముస్లింలకు ఆఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ అన్నారు. సోవారం మండల కేంద్రానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ శ్రీరాం రాము ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, సుధీర్, అనపురం రవి, చిలుక బిక్షపతి, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

26న ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తానంచర్ల గ్రామంలో ఈనెల 26న ప్రగతి సేవా సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ మహబూబాబాద్ జిల్లా కోర్డినేటర్ ఐనాల పరశురాములు తెలిపారు.

హామీలు నెరవేర్చాలి

దంతాలపల్లి: ఉద్యమకారులకు ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేరవేర్చాలని ఉద్యమకారుల మండల అధ్యక్షుడు మిడుతపల్లి వెంకన్న, ప్రధాన కార్యదర్శి కారుపోతుల రాము అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఉద్యమకారులు వెంకన్న, శ్రీనువాస్, సంపత్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

పరామర్శ..

తొర్రూరు రూరల్: సూర్యాపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన గడ్డం రవీందర్, రేణుక భార్య, భర్తలతోపాటు కుమారై రిషిత మృతి చెందగా, మృతదేహాలకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించి, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందించారు.

నూతన భవనం నిర్మించాలి

మహబూబాబాద్ అర్బన్: పీజీ కళాశాలకు కేటాయించిన స్థలంలో తక్షణమే ప్రభుత్వం నూతన భవనం నిర్మించాలని డీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు మాలోతు శాంతి కుమార్, గుగులోతు సూర్యప్రకష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కళాశాల కార్యాలయం ఎదుట డీఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నాయకుల సోమవారం ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, శ్రీను, నాయకులు నిరోష, స్వప్న, అంజలి, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్స్ చట్టరీత్యా నేరం

మహబూబాబాద్ రూరల్: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్స్ చట్టరీత్యా నేరమని మహబూబాబాద్ టౌన్, రూరల్ సీఐలు పెండ్యాల దేవేందర్, సర్వయ్య సోమవారం తెలిపారు. బెట్టింగ్ పెట్టుబడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

వేతనాలు చెల్లించాలి

కురవి: జీఓ 51ని వెంటనే రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న జీపీ కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లోజు ఉపేంద్రచారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వీరబాబు, ఎంపీఓ గౌస్‌లకు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.

మహిళలకు గాయాలు

డోర్నకల్: చెరుకు రసం తీసే మిషన్ తగిలి ఓ మహిళకు గాయాలయ్యాయి. ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చిన కొంతమంది పట్టణంలోని పలు ప్రాంతాల్లో జ్యూస్ పాయింట్లతోపాటు చెరుకు రసం విక్రయించే దుకాణాలను ఏర్పాటు చేశారు. బ్యాంక్ స్ట్రీట్‌లో రజిని అనే మహిళ మిషన్ ద్వారా చెరుకు రసం తీస్తుండగా ప్రమాదవశాత్తు జుట్టు మిషన్‌లోకి వెళ్లడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కృతజ్ఞతలు

గార్ల: ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని పూర్తిస్థాయిలో రైతులకు ఉపయోగపడేలా రూపొందించిన సీసీఎల్‌ఏ అసిస్టెంట్ కమిషనర్ వి.లచ్చిరెడ్డికి జిల్లా టీజీఆర్‌ఎస్‌ఏ అధ్యక్షుడు శ్రీరామ్ రాథోడ్, జనరల్ సెక్రటరీ రాజు సోమవారం కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ అరెస్టులను ఖండించండి

నెహ్రూసెంటర్: ఆశవర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌కు వెళ్తున్న ఆశలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ సోమవారం తెలిపారు.

కల్యాణ మండప నిర్మాణం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తానంచర్ల గ్రామంలోని శంభులింగేశ్వర ఆలయంలో కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ బాల్ని మాణిక్యం సోమవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సెన్సేషనల్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ఎండీ తాల్లూరి సతీష్‌కుమార్, విజయ దంపతులు తమ సొంత ఖర్చులు.రూ. 3లక్షలు వెచ్చించి మండపాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.

27న వాహనాల వేలం

గూడూరు: మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఈనెల 27న పలు కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం పాట నిర్వహించనున్నట్లు సీఐ భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజయవంతం చేయాలి

కేసముద్రం: ఎస్సీ,ఎస్టీ, బీసీల రాజ్యస్థాపనే లక్ష్యంగా అదిలాబాద్ జిల్లాలో ఏప్రిల్ 14న ప్రారంభించనున్న మా భూమి రథయాత్రను విజయవంతం చేయాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ సురుగు శ్రీకాంత్ సోమవారం తెలిపారు. కార్యక్రమంలో కొమ్ము రామకృష్ణ, సుధాకర్, శ్రీనివాస్, సురేష్, వల్లందాసు సతీష్, కల్యాణ్ పాల్గొన్నారు.

వే బ్రిడ్జిల పరిశీలన

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలో గల వేబ్రిడ్జిలను తూనికల కొలతల శాఖ జిల్లా అధికారి విజయ్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కార్యక్రమంలో టెక్నీషియన్ బొల్లోజు శ్రీనివాసచారి పాల్గొన్నారు.

వంట సామగ్రి పంపిణీ

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట కార్మికులకు వంట సామగ్రి అందజేసినట్లు ఎంఈఓ రాందాస్ సోమవారం తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

తొర్రూరు రూరల్: మండలంలోని నాంచారీమదూరు గ్రామ శివారులో వాహనాల తనిఖీల్లో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ఉపేందర్ సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని దయ్యంబండ తండాకు చెందిన వంకుడోతు నవీన్ అనే వ్యక్తి 8క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో వేసుకొని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని సివిల్ సప్లయి అధికారులకు అప్పగించి, సంబంధిత వ్యక్తిని అదుపులోని తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని డీటీఓకు వినతి



మహబూబాబాద్: హాస్టల్‌లో డైలివేజ్ కాంటిజెన్స్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యాకుబ్ డిమాండ్ చేశాడు. అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డీటీఓ సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా యాకుబ్ మాట్లాడుతూ.. జిల్లాలో వర్కర్లు సుమారు 200మంది ఉన్నారని, నాలుగు నెలల క్రితం వరకు ప్రతి రోజు రూ.515 చొప్పున వేతనాలు ఇచ్చారని, ప్రస్తుతం డీటీఓ ఆదేశాలతో రూ.390 చొప్పున ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీఎన్జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మక్కలతో మార్కెట్ కళకళ


కవరు షెడ్డులోని మక్కల రాశులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు మొక్కజొన్న రాశులతో సోమవారం కళకళలాడింది. అధిక మొత్తంలో మక్కలు రావడంతో మార్కెట్ ఆవరణలోని కవర్ షెడ్డు ప్రాంగణం నిండిపోయింది. 5,880 బస్తాల (3,528 క్వింటాళ్లు) మక్కలు విక్రయం జరుగగా.. క్వింటా గరిష్ట ధర రూ.2,235, కనిష్ట ధర రూ.1,959 పలికింది.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఉన్న ఆర్థికంగా వెనకబడిన తరగతులు (ఈబీసీ), ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కి చెందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం వర్తిస్తుందని, అర్హులైన వారి నుంచి దరకాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి బి. నర్సింహరావు సోమవారం తెలిపారు. యువకులు ఆర్థిక సహాయం కింద వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 5వ తేదీ వరకు చివరి గడువు ఉందని, పూర్తి వివరాలకు కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రమాదానికి కారణమైన లారీ పట్టివేత

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం శివారు వరంగల్–ఖమ్మం హైవేపై మిరప కాయలు ఏరడానికి వెళ్తున్న కూలీల ఆటోను ఢీకొట్టి ప్రమాదానికి కారణమైన లారీని పట్టుకున్నట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం పెద్దనాగారం ఇటుక బట్టీల సమీపంలో కూలీలతో వెళ్తున్న ఆటోను తెల్లవారుజామున గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో పలువురికి గాయాలు, ఒకరు మృతి చెందిన ఘటన తెల్సిందే. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఖమ్మం–వరంగల్ ప్రధాన రహదారిపై వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించి, ఖమ్మం పరిసరాల్లో సోమవారం లారీని పట్టుకొని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో వేంకటేశ్వర స్వామివారి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కాగా ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి సప్తమ బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం పూజలు జరుగుతాయని అర్చకులు తెలిపారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

మహబూబాబాద్: ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మెప్మా డీఎంసీ విజయ అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, స్వయం సహాయక సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం క్లాత్ బ్యాగ్‌లు, స్టీల్ గ్లాసులు, వాటర్ బాటిళ్లు తదితర వాటితో స్టాల్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ లెవల్ రిసోర్స్ పర్సన్ ఉమ, టౌన్ లెవల్ ఫెడరేషన్ రిసోర్స్ పర్సన్ మమత, సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

గూడూరు: మండలంలోని మధనాపురం గ్రామంలో శ్రీ పద్మావతి గోదా సమేత ఆనంద వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం కనుల పండువలా జరిపించారు. రెండు రోజులుగా యాగ్నికులు ముడుంబై లక్ష్మీ నారాయణాచార్యులు, దత్తు, కృష్ణ, రాము, అచ్యుత్, హేమంత్, రఘు, వెంకటేశ్వరుల ఆధ్వర్యంలో ఉత్సవాలను కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం చక్రస్నానం , పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని, ఆలయ నిర్మాణ ధర్మకర్త లింగాల సుధీర్‌రెడ్డి రాధిక దంపతులు తెలిపారు.

మోడల్ స్పోర్ట్స్ ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా పాలకాల కొత్త గూడ గిరిజన మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లు ఫైనల్ ఎంపికలు ఈనెల 26 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి సంక్షేమ శాఖ అధికారి గుగులోతు దేశీరాంనాయక్ సోమవారం తెలిపారు. మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్లు 5వ తరగతిలో 40, ఆరో తరగతిలో 8, ఏడో తరగతిలో 6, ఎనిమిదో తరగతిలో 4, తొమ్మిదో తరగతిలో 6, పదో తరగతిలో 16 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

మొక్కజొన్న చేను దగ్ధం



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని గుండాలగడ్డ తండా గ్రామానికి చెందిన రైతు భూక్య బాల్యానాయక్ ఎకరం న్నర మొక్కజొన్న చేను అగ్నికి దగ్ధమైంది. రైతు బాల్యానాయక్ మొక్కజొన్న కంకులను కోసి కిందపోసి ఉంచగా మధ్యాహ్నం ఒక్కసారిగా 11కేవీ విద్యుత్ తీగ తెగిపడిపోయింది. వెంటనే మంటలు మొదలై కంకులు, మొక్కజొన్న మొదళ్లు అంటుకుని కాలి బూడిదయ్యాయి. నోటికాడికి వచ్చిన మొక్కజొన్న పంట 11కేవీ విద్యుత్ తీగతెగిపడిన కారణంగా అగ్నికి ఆహుతై లక్ష రూపాయల వరకు ఆస్తినష్టం సంభవించిందని రైతు దంపతులు బోరున విలపించారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646